RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

వరంగల్ | శనివారం | పేజీలు : 6 | దినపత్రిక
సంపుటి : 4, సంచిక : 47 | జనవరి 24, 2026 | వెల : రూ.3-00



3లో..

రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

# జన మేడారం



- తల్లుల దర్శనం కోసం అడవి తల్లి ఒడికి..
- భారీగా చేరుకుంటున్న భక్తులు
- ముందస్తు మొక్కులతో గద్దెల ప్రాంగణాలు కిటకిట
- భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- ఏఐ టెక్నాలజీ, డ్రోన్ల నిఘాలో ఆదివాసీ కుంభమేళా
- ప్రధాన ఘట్టాలకు ముందే పోటెత్తుతున్న జనం
- భక్తులను నిలువు దోపిడీ చేస్తున్న వ్యాపారులు

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి:**

మేడారం.. ఆ పేరు వింటేనే భక్తి పారవశ్యం ఉప్పొంగుతుంది. అడవి తల్లుల నామస్మరణతో అరణ్యం మార్మోగుతోంది. ఈ నెల 28 నుంచి నాలుగురోజుల పాటు ప్రారంభం కానున్న మహా జాతర కోసం దేశం నలుమూలల నుంచి భక్తులు ముందస్తుగానే తరలివస్తున్నారు. జాతర రోజుల్లో రద్దీ అధికంగా ఉంటుందని భావిస్తున్న భక్తులు, వారం రోజుల ముందే మేడారానికి చేరుకుని తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. జాతరలో అత్యంత కీలకమైన ఘట్టాలు 28, 29, 30, 31న నాలుగు రోజుల పాటు జరగనున్నాయి. అమ్మవార్ల వనప్రవేశంతో జాతర ముగుస్తుంది. గత జాతరల అనుభవాల ఆధారంగా ఈసారి సుమారు 3కోట్ల మందికి పైగా భక్తులు మేడారం చేరుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**– ముందస్తు మొక్కులు**

జాతర ప్రధాన రోజుల్లో కిలోమీటర్ల మేర క్యూలైన్లు ఉంటాయని, దర్శనానికి గంటల కొద్దీ సమయం పడుతుందని భక్తులు ముందుగానే మేడారం వస్తున్నారు. తల్లుల గద్దెల వద్ద తెల్లవారు జామునుంచే భక్తుల వరుసలు దర్శనమిస్తున్నాయి. భక్తిశ్రద్ధలతో బంగారం, కానుకలు సమర్పిస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. తొలుత జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి, ఆపై పసుపు కుంకుమలతో అలంకరించుకుని, తమ ఎత్తు తూకం బంగారం తలకెత్తుకుని గద్దెల వద్దకు చేరుకుంటున్నారు. అమ్మవార్లకు కోళ్లు, గొర్రెలతో పాటు నిలువు దోపిడీలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

**– పకడ్బందీగా ప్రభుత్వం ఏర్పాట్లు**



భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ప్రభుత్వం ఈసారి పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. తాగునీరు, వైద్య సేవలు, శౌచాలయాలు, విశ్రాంతి కేంద్రాలు వంటి సౌకర్యాలను విస్తృతంగా ఏర్పాటు చేశారు. మేడారం పరిసర గ్రామాల్లో వేల సంఖ్యలో తాత్కాలిక టెంట్లు ఏర్పాటు చేసి, వృద్ధులు, మహిళలు, పిల్లలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారు. మరోవైపు, జాతర ప్రధాన ఘట్టాలకు ఇంకా మూడు రోజులు మాత్రమే ఉండటంతో మేడారం ప్రాంతం రోజురోజుకూ భక్తజనంతో కిక్కిరుస్తోంది. భద్రత, సౌకర్యాల సమన్వయంతో ఈసారి జాతరను అంతర్జాతీయ స్థాయి నిర్వహణగా నిలబెట్టేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

**– హైటెక్ నిఘా..**

ఈసారి మేడారం జాతరలో భద్రత, క్రౌడ్ మేనేజ్‌మెంట్‌లో ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తోంది. ప్రధాన కూడళ్లు, వాగు వద్ద జనం ఎంత మంది ఉన్నారో సెకన్ల వ్యవధిలో లెక్కించేలా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కెమెరాలను ఏర్పాటు చేశారు. గాల్లో ఎగిరే డ్రోన్ల ద్వారా ఎప్పటికప్పుడు ట్రాఫిక్, జనసాంద్రతను కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షిస్తున్నారు. వేలాది మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కలెక్టర్, ఎస్పీ క్షేత్రస్థాయిలో ఉండి అధికారులతో సమన్వయం చేసుకుంటూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తున్నారు.

**– ఆర్టీసీ నుంచి ఆకాశ మార్గం వరకు..**

భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం యుద్ధప్రతిపాదికన ఏర్పాట్లు చేసింది. తెలంగాణలోని అన్ని ప్రధాన నగరాల నుంచి వేలాది ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. మేడారంలోనే భారీ బస్టాండ్‌ను నిర్మించి ఎక్కడికక్కడ సిబ్బందిని నియమించారు. హైదరాబాద్, హన్మకొండ నుండి మేడారానికి హెలికాప్టర్ సర్వీసులు ప్రారంభమయ్యాయి. సమయం పొదుపు చేయాలనుకునే భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకుంటున్నారు. హన్మకొండనుంచి మేడారం వెళ్లి రావడానికి ఒక్కరికి రూ. 31వేలు చార్జ్ చేస్తున్నారు.

**– 'బంగారం' ధరకు రెక్కలు!**

అమ్మవారికి సమర్పించే బెల్లం (బంగారం) ధరలు మేడారంలో చుక్కలు చూపిస్తున్నాయి. భక్తుల రద్దీని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. అంతేకాదు కొందరు వ్యాపారలు భక్తులకు అవసరమైన నిత్యవసరాలు, తాగునీరు, కర్రలు, గ్యాస్, స్టౌలు, కోళ్లు వంటివి భారీ ధరలకు అమ్ముతూ సొమ్ముచేసుకుంటున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని నిర్ణీత ధరల వద్దే విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

## 'ఉపాధి' పనులను ప్రారంభించిన సర్పంచ్


**వేద న్యూస్, కారేపల్లి:**



కారేపల్లి మండలంలోని ఈ విశ్వనాథపల్లి గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం స్థానిక సర్పంచ్ ఇస్లావత్ రాజు నాయక్ కొబ్బరికాయ కొట్టి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కూలీకి చేతినిండా పని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను సూచించారు. కూలీల హాజరు నమోదు, కొలతల ప్రక్రియలు కచ్చితంగా పాటించాలని అన్నారు. పని ప్రదేశంలో నీడ, తాగునీరు వంటి మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని, ఉపాధి హామీ పనుల ద్వారా కూలీలకు ఉపాధి లభించడమే కాక భూగర్భ జలాల నిల్వకు కూడా దోహదపడుతుందని పేర్కొన్నారు. గ్రామ ప్రజలంతా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సురపురెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి, వార్డు సభ్యులు బొగరపు ముఖర్జీ, ఫీల్డ్ అసిస్టెంట్ సందీప్, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కాలేజీలో పూర్వ విద్యార్థినికి సన్మానం

వేద న్యూస్, కారేపల్లి:



కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయ కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2002-2003 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థిని కేలోతు లలితను ఘనంగా సన్మానించారు. ఇదే కళాశాలలో చదివి నేడు ఇల్లందు జేబీఎస్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా ప్రభుత్వ ఉద్యోగం సాధించిన ఆమెను ప్రిన్సిపాల్ విజయ కుమారి, అధ్యాపక బృందం అభినందించారు. లలిత వంటి విద్యార్థులు మా కళాశాలకు గర్వకారణం. క్రమశిక్షణ, కృషితో ఉన్నత స్థాయికి చేరవచ్చని ఆమె నిరూపించారు అని ప్రిన్సిపాల్ కొనియాడారు. వార్షికోత్సవ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిట్ విచారణపై కేటీఆర్ సూటి ప్రశ్నలు

3లో..

# పురపోరు వేళ వర్గపోరు!

- కాంగ్రెస్ పార్టీలో టికెట్ల కోసం ఆధిపత్యం
- గాంధీ భవన్ వేదికగా బయటపడ్డ నిజామాబాద్ నేతల వ్యవహారం
- తమ వారికే ఇవ్వాలంటూ పట్టు
- లేకుంటే వ్యతిరేకంగా పనిచేసే చాన్స్
- మంత్రులకు సవాల్ గా మున్సిపల్ ఎన్నికలు



**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో:**

మున్సిపల్ ఎన్నికలపై సీరియస్ ఫోకస్ పెట్టింది అధికార హస్తం పార్టీ. మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవడమే టార్గెట్‌గా పావులు కదుపుతోంది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఎన్నికల బాధ్యులను ప్రకటించింది. మున్సిపల్ ఎన్నికలు జరగనున్న 15 పార్లమెంట్ నియోజకవర్గాలకు 15 మంది మంత్రులను ఇంచార్జ్‌లను నియమించారు సీఎం రేవంత్ రెడ్డి. నియోజకవర్గాల వారీగా మంత్రులు సన్నాహక సమావేశాలు పెట్టాలని సూచించారు. అయితే ఇంచార్జ్ మంత్రులకు అక్కడే అసలు ట్విస్ట్ మొదలైంది. అధికార పార్టీ తరఫున తీవ్రస్థాయిలో పోటీ ఉందని మంత్రుల దృష్టికి వచ్చింది. కొత్త, పాత కాంగ్రెస్ నేతలు టిక్కెట్ల కోసం వర్గాలుగా విడిపోయి పోటీ పడుతున్నారు. ఈ క్రమంలోనే గాంధీభవన్‌లో జరిగిన నిజామాబాద్ పార్లమెంట్ సన్నాహక సమావేశం రసాభాసాగా మారింది.

**ఎమ్మెల్యే వర్సెస్ మాజీ మంత్రి**

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ వర్సెస్ మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, మధ్య ఇప్పటికే ఉప్పు, నిప్పులా ఉన్న వ్యవహారం కాస్త.. సన్నాహక సమావేశం సాక్షిగా మరోసారి దుమారం రేగింది. ఏకంగా సంజయ్ ఉన్న మీటింగ్‌కు తాను హాజరుకాబోనని సమావేశం నుంచి బయటికి వచ్చి రచ్చ చేశారు మాజీమంత్రి జీవన్‌రెడ్డి. ఈ పరిస్థితుల్లో అభ్యర్థుల ఎంపిక మంత్రులకు పెద్ద సవాల్‌గా మారింది. పోటీ చేయనున్న ప్రతి స్థానానికి ఆరుగురు పేర్లతో లిస్ట్ రెడీ చేయాలని మంత్రులను పీసీసీ చీఫ్, సీఎం ఆదేశించారు. అయితే ఒక్కో స్థానం నుంచి ఇరవై మందికిపైగా ఆశావహులు ఉండటంతో నేతలు తలలు పట్టుకుంటున్నారు.

**వర్గపోరుతో తలనొప్పి**

మున్సిపల్ ఎన్నికల్లో ఎమ్మెల్యే వర్గం, ఎంపీ వర్గం, డీసీసీ అధ్యక్షుడి వర్గం, పీసీసీ వర్గం, ఇంచార్జ్ మంత్రి వర్గం, మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ మంత్రి వర్గం అంటూ డజన్ల మంది ఆశావహులు టికెట్ రేసులో ఉన్నారు. ఇక ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో ఈ సమస్య మరింత ఇబ్బందికరంగా ఉంది. జగిత్యాల, పటాన్ చెరు, గద్వాల్, బాన్సువాడ వంటి చోట్ల ఎవరికి టికెట్ రాకపోయినా మిగతా వర్గాల వాళ్లతో కలిసి పార్టీ టికెట్ ఇచ్చిన వారికి వ్యతిరేకంగా పనిచేసేలా క్లాషెస్ ఉన్నాయట. దీంతో మంత్రులకు కొత్త భయం పట్టుకుందట.

**మంత్రులకు సవాల్**

పంచాయతీ ఎన్నికల్లో తక్కువ స్థానాలు వచ్చిన చోట పార్టీ నేతల తప్పిదాలపై సీఎం రేవంత్ బాధ్యులపై సీరియస్ అయినట్లు సమాచారం. దీంతో మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి మిస్టేక్ జరిగినా తమపై ఎఫెక్ట్ పడుతుందని మంత్రులు ఆందోళన చెందుతున్నారట. గతంలో రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు.. లోకల్ పోరులో పార్టీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ ఇద్దరు మంత్రులు మారెప్ప, మాగంటి బాబులు రాజీనామా చేశారు. దీంతో ఇప్పుడు పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ బాధ్యతలు తీసుకున్న మంత్రులకు ఈ ఎన్నికలు డూ ఆర్ డై అన్నట్లుగా మారాయట.

# 24/7 అందుబాటులో ఉంటా



- బొమ్మినేని రాకేష్

- ఆదరించి.. ఆశీర్వదించండి
- సేవకుడిగా మీ ముందుకు వస్తున్న
- 27వ వార్డు ప్రజలకు అభ్యర్థన
- జనసేన కౌన్సిలర్ అభ్యర్థి బొమ్మినేని రాకేష్

**వేద న్యూస్, జమ్మికుంట:**

సేవే లక్ష్యంగా ముందుకు వస్తున్న తనని.. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ గా గెలిపించాలని 27వ వార్డు అభ్యర్థి, జనసేన నాయకుడు బొమ్మినేని రాకేష్ కోరారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించే అవగాహన కలిగిన నాయకులను మాత్రమే కౌన్సిలర్ గా ఎన్నుకోవాలని పేర్కొన్నారు. తనను ఆదరించి ఆశీర్వదిస్తే సేవకుడిగా.. 24/7 ప్రజలకు అందుబాటులో ఉంటానని వెల్లడించారు.

**జనమే నా బలం బలగం: రాకేష్**

27వ వార్డు ప్రజలే తన కుటుంబ సభ్యులని, ప్రజలే తన బలం, బలగమని జనసేన నేత రాకేష్ పేర్కొన్నారు. వార్డు ప్రజల సమస్యలన్నింటినీ తాను చిత్తశుద్ధితో పరిష్కరిస్తానని స్పష్టం చేశారు. ప్రతి పనికి తాను ముందు ఉంటానని, సేవకుడిగా కర్తవ్యం నిర్వహించడంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా యువతకు ప్రజలకు అవసరమైన అన్ని విషయాలపై తాను అవగాహన కలిగి ఉన్నానని, తనకు ఒకసారి అవకాశం ఇస్తే.. నాయకుడిగానే కాకుండా సేవకుడిగా ప్రతి ఒక్కరి పనిని తన భుజాల మీద వేసుకొని పూర్తి చేసే బాధ్యతను తీసుకుంటానని, తనను రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ గా గెలిపించాలని ప్రజలను వినమ్రంగా వేడుకున్నారు.

# జనంతో మమేకమవుతూ..

- ముందస్తుగానే 7వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి యేబూషి ఆర్యన్ కౌశిక్ ప్రచారం
- విద్యావంతుడినైన తనను ఆశీర్వదించి..గెలిపించాలని ప్రజలకు అభ్యర్థన





**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి యేబూషి ఆర్యన్ కౌశిక్ ముందస్తుగానే ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల బరిలో ఉంటున్న ఆయన వార్డు ప్రజలను ముందస్తుగానే కలుస్తున్నారు. ఇంటింటికీ, గడపగడపకు తిరుగుతూ... తనను ఆదరించి ఆశీర్వదించాలని కోరుతూ ముందుగానే ఓట్ల ప్రచారం కౌశిక్ షురూ చేసారు. ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటానని., స్వార్థం కోసం రాజకీయాల్లోకి రావడంలేదని నిస్వార్థంగా నిష్పక్షపాతంగా ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో ఎన్నికల బరిలో ఉంటున్నట్టు ప్రజలకు వివరిస్తున్నారు. అభివృద్ధి విషయంలో రాజీపడకుండా సమస్యల పరిష్కారంలో ముందుంటానని ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని కౌశిక్ ప్రజలను అభ్యర్థిస్తున్నారు. కాగా, త్వరలో మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానున్న సందర్భంగా.. ఎన్నికల కోడ్ రాకముందే ముందస్తుగా ప్రచారంలో కౌశిక్ ముందంజలో ఉన్నట్టుగా ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. 7వ వార్డు కౌన్సిలర్ గా కౌశిక్ గెలుపు కోసం పార్టీలకతీతంగా అందర్నీ కలుపుకొని ముందుకెళ్తామని, కౌశిక్ పేర్కొంటూ ఉండడం తో ఆయన గెలుపు ఖాయమని అనుచరులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# ముందస్తు విస్తృత ప్రచారం

- నిత్యం అందుబాటులో ఉంటాం..
- 3వ వార్డు అభ్యర్థి కొలకాని రాజకుమారి రాజు



**వేద న్యూస్, జమ్మికుంట:**

రాబోయే మున్సిపల్ ఎన్నికలలో తమను ఆదరించి.. ఆశీర్వదించాలని మూడో వార్డు కౌన్సిలర్ గా గెలిపించాలని 3వ వార్డు(రామన్నపల్లె) అభ్యర్థి కొలకాని రాజకుమారి రాజు ప్రజలను కోరారు. వారు ముందస్తుగానే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అభివృద్ధి యే తమ ఎజెండా అని వారు ప్రజలకు వివరించారు. తమను కౌన్సిలర్ గా గెలిపించాలని ప్రజలను కోరారు. ఇంటికి తిరుగుతూ కమలం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. వార్డు ప్రజల శ్రేయస్సు ధ్యేయంగా పని చేస్తామని చెప్పారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సహకారం తో వార్డు తో పాటు జమ్మికుంట పట్టణ అభివృద్ధి కి కృషి చేస్తానని తెలిపారు. జమ్మికుంట పట్టణాభివృద్ధికి ఇప్పటికే కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ నిధులు మంజూరు చేశారనీ బిజెపి జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కమలం పార్టీని ఆదరించి ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు. ప్రచారంలో భాగంగా రాజు దంపతులు గడపగడపకు తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ..24/7 సేవలందించే నాయకులను కౌన్సిలర్లుగా ఎన్నుకోవాలని కోరారు. ముందస్తుగానే ఎన్నికల ప్రచారంలో 3వ వార్డు అభ్యర్థి కొలకాని రాజకుమారి రాజు పాల్గొంటున్న నేపథ్యంలో వారి విజయం పట్ల బిజెపి నేతలు కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# గ్రంథాలయంలో రీడింగ్ హాల్ ప్రారంభం

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలోని స్థానిక గ్రంథాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన రీడింగ్ హాల్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత-చంద్రశేఖర్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంతిరెడ్డి రాజారెడ్డి మాట్లాడుతూ.. జీవితంలో ఏదైనా సాధించాలంటే చదువు తప్పనిసరి అని అన్నారు. నిరుద్యోగులు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈ రీడింగ్ హాల్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, గ్రామ పెద్దలు బచ్చు రామ్ సెట్, రైడ్స్ అధ్యక్షుడు కృష్ణ, రైడ్స్ సభ్యులు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బుక్స్, పెన్నుల పంపిణీ

**వేద న్యూస్, రుద్రూర్:**



వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని రుద్రూర్ మండల కేంద్రంలోని రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో గల సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా షికారి శివ, వంజరి గణేష్, ఎంపీ గంగారాం, సంతోష్ సహకారంతో విద్యార్థులకు బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. శ్రీవాణి సాహితి విద్యానికేతన్ విద్యార్థులు, చిన్నారులకు ఈ కార్యక్రమంలో విద్యా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి రాజేశ్వర్ అప్ప, యువరాజ్ అప్ప, ఆలయ కమిటీ అధ్యక్షుడు కటికే రామ్ రాజ్, సతీష్ గౌడ్, కన్నెరవి, శ్రీ వాణి సాహితి విద్యానికేతన్ ప్రిన్సిపాల్ లోగం నాగరాజు, లోగం సరస్వతి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# వేద న్యూస్ క్యాలెండర్ ఆవిష్కరించిన తహసీల్దార్, ఎస్సై

**వేద న్యూస్, వీర్నపల్లి:**






రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలంలో వేద న్యూస్ తెలుగు దినపత్రిక 2026 క్యాలెండర్‌ను తహసీల్దార్ ముక్తార్ పాషా, ఎస్ఐ వేముల లక్ష్మణ్ ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు నిజమైన సమాచారాన్ని అందించడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమన్నారు. సమాజ సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడం తో పాటు, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో వేద న్యూస్ చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వేద న్యూస్ రాజన్న సిరిసిల్ల జిల్లా రిపోర్టర్ కళ్యాణ్ పాల్గొన్నారు.

# ఘనంగా నేతాజీ జయంతి వేడుకలు

**వేద న్యూస్, మందమర్రి:**



స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మందమర్రి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మాజీ ఆర్మీ జవాన్ రాజేష్ పివ్వాల్ దంపతుల ఆధ్వర్యంలో వారి నివాసంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలవేసి, కేక్ కట్ చేసి జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ పివ్వాల్ మాట్లాడుతూ.. నేతాజీ 1897 జనవరి 23న ఒడిశాలోని కటక్‌లో జన్మించారని, ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి బ్రిటిష్ పాలకులకు సవాల్ విసిరిన మహానేత అని అన్నారు. దేశభక్తుల త్యాగాలను తరతరాలూ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భర్ సాయి పివ్వాల్, సరోజ చందాలియా, రాణవీర్ సర్వాన్, పవన్ కాగడా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సామూహిక అక్షరాభ్యాసాలు

- జ్ఞాన సరస్వతి ఆలయానికి పోటెత్తిన భక్తులు



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి పట్టణంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో వసంత పంచమిని పురస్కరించుకుని సామూహిక అక్షరాభ్యాసాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద పండితులు చిన్నారులకు అక్షర శ్రీకారం చుట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు సింహాచలం జగన్మోహన్ స్వామి, శ్రీ భాష్యం నవీన్ కుమార్ ఆధ్వర్యంలో బృందాల వారీగా అక్షరాభ్యాసాలు నిర్వహించారు. చొప్పదండి పట్టణంతో పాటు పలు జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

# మహిళలను వేధించడం చట్టరీత్యా నేరం

**వేద న్యూస్, హనుమకొండ :**




- డాక్టర్ అనితా రెడ్డి

అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో పోష్ యాక్ట్2013 (కార్యస్థలాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం) పై హన్మకొండ లోని స్వధార్ మహిళా ఆశ్రమములో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సొసైటీ చైర్మన్ కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు, పోష్ ఆక్ట్ ఎక్స్ టర్నల్ మెంబర్ మరియు ట్రైనర్ డాక్టర్ అనితా రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోష్ యాక్ట్2013 గురించి మాట్లాడుతూ పనిచేసే ప్రదేశాల్లో మహిళలను లైంగిక వేధింపులకు గురి చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన పని వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రతి శాఖాధిపతి, కార్యాలయ అధికారి పై ఉందని పేర్కొన్నారు. పని ప్రదేశాలలో భద్రతతో కూడిన భరోసా, స్వేచ్ఛగా పనిచేసి వాతావరణం కల్పించాలని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. పోష్ యాక్ట్2013 ప్రకారం 10 మంది కంటే ఎక్కువ మంది సిబ్బంది పనిచేసే ప్రతి కార్యాలయంలో తప్పనిసరిగా అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలని, అందులో 50 శాతం మహిళల భాగస్వామ్యం ఉండాలని అన్నారు. కమిటీలో మహిళా అధ్యక్షురాలు ఉండాలని, బయటి నిపుణుడిని కూడా ఎక్స్టర్నల్ మెంబర్ గా నియమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చినప్పుడు వాటిని గోప్యతతో, నిష్పక్షపాతంగా, వేగంగా విచారణ చేసి పరిష్కరించాలని సూచించారు. పోష్ యాక్ట్‌పై ప్రతి ఒక్కరికీ ముఖ్యంగా ఉద్యోగులకు అవగాహన ఉండాలని, తరచూ శిక్షణా కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహించాలని, పోస్టర్లు, కరపత్రాలు కార్యాలయాల్లో ప్రదర్శించాలని సూచించారు. మహిళలు ధైర్యంగా ఫిర్యాదు చేయగల వాతావరణం కల్పించడమే ఈ చట్టం లక్ష్యమని తెలిపారు. చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే వినియోగించుకో గలుగుతారని అన్నారు. మహిళలు ఏదైనా సమస్య వస్తే భయం వీడి సమస్యలను ఎదుర్కొనే స్థాయిలో ఉండాలని అన్నారు. మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో స్వధార్ నిర్వహకులు శైలజ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**



వేములపల్లి మండల కేంద్రంలోని ఆమనగల్లు గ్రామం లోని అంగన్వాడీ కేంద్రం-1లో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ పిల్లల సందీప్ హాజరై చిన్నారులకు పలకపై అక్షరాలు రాయించి అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం అంగ న్వాడీ కేంద్రాన్ని పరిశీలించి, చిన్నారులకు అందుతున్న సౌకర్యాలపై టీచర్ వల్లంపట్ల కాంతమ్మను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాలెం రాజు, వార్డు సభ్యులు, అంగన్వాడీ ఆయా సంధ్య, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- దివ్యాంగులకు అన్ని పథకాలు హక్కుగా అందించాలి
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- రైతులు, దివ్యాంగులకు పరికరాల పంపిణీ
- హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**వేద న్యూస్, వేములవాడ:**

రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తున్నదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వ్యవసాయ శాఖ, మహిళా శిశు దివ్యాంగుల వృద్ధుల సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యవసాయ యంత్రాలు, దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం వేములవాడ మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై లబ్ధిదారులకు పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రూ. రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా, రైతు భీమా, సన్న వడ్లకు బోనస్, మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వంటి పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయ ఆధునీకరణ కోసం సబ్సిడీపై వివిధ యంత్రాలు అందజేస్తున్నామని, అర్హులైన రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. దివ్యాంగులకు స్కూటీ రెట్రోఫిటెడ్ వాహనాలు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, స్మార్ట్‌ఫోన్లు ప్రభుత్వం అందజేస్తోందని తెలిపారు. దివ్యాంగులకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్‌తో పాటు అన్ని పథకాలు హక్కుగా అందించాలని అన్నారు. ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ఆధునీకరణ యంత్రాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పంటల వైవిధ్యీకరణ, ఆయిల్ పామ్ వంటి దీర్ఘకాలిక ఆదాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో అర్హులైన దివ్యాంగులు ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 2368 వ్యవసాయ పరికరాలకు రూ. 1.84 కోట్ల సబ్సిడీ మంజూరైందని అధికారులు తెలిపారు. 75 మంది రైతులకు వివిధ యంత్రాలు, దివ్యాంగులకు 20 స్కూటీ రెట్రోఫిటెడ్ వాహనాలు, 3 ల్యాప్‌టాప్‌లు, 1 ట్యాబ్, 1 స్మార్ట్‌ఫోన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, ఆర్డీఓ రాధాభాయ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

# కమిషనరేట్ నుంచి బహిష్కరణ

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ శాంతి భద్రతల పరిరక్షణ పరిరక్షణలో మీల్స్ కాలనీకి పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన రౌడీషీటర్ వంచనగిరి సురేష్ అలియాస్ కోతి సురేష్ ను వరంగల్ పోలీస్ కమిషనరేట్ నుండి బహిష్కరణ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. తొలిసారిగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రజా శాంతి, భద్రతలకు భంగం కలిగిస్తున్న రౌడీషీటర్ వంచనగిరి సురేష్ పై హైదరాబాద్ సిటీ పోలీస్ చట్టం, 1348 ఫస్లి (వరంగల్ మెట్రోపాలిటన్ ఏరియా పోలీస్ చట్టం, 2015) లోని సెక్షన్ 26(1) ప్రకారం ఆరు నెలలు బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేయబడ్డాయి. ఈ ఉత్తర్వుల జారీ అనంతరం మీల్స్ కాలని ఇన్స్ స్పెక్టర్ రమేష్, ఎస్ఐ మిథున్ నిందితుడు సురేష్ ను వరంగల్ పోలీస్ కమిషనరేట్ సరిహద్దులో సీపీ జారీచేసిన ఉత్తర్వులను అందజేశారు. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌కు చెందిన వంచనగిరి సురేష్ రౌడీషీటర్‌గా గుర్తించబడిన వ్యక్తి కాగా, అతనిపై గతంలో పలు తీవ్రమైన నేర కేసులు నమోదై ఉన్నాయి. ఆయా కేసులు ప్రజలలో భయాందోళనలను సృష్టిస్తూ, శాంతియుత జీవన విధానానికి ఆటంకం కలిగించినట్లు పోలీసు రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఇతని అక్రమ కార్యకలాపాల కారణంగా ప్రజలు ఫిర్యాదులు చేయడానికి కూడా భయపడుతున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో, అతనికి కారణాలు చూపించాలని నోటీసు జారీ చేయగా, సంబంధిత అధికారుల ఎదుట హాజరు కాలేదు. ఎలాంటి వ్రాతపూర్వక వివరణ ఇవ్వకపోవడంతో, అతని వైఖరి ప్రజా శాంతికి ముప్పుగా మారిందని నిర్ధారణకు వచ్చారు. అందువల్ల, ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని, వంచనగిరి సురేష్‌ను వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి నుంచి ఆరు (6) నెలల కాలానికి వెంటనే బయటకు వెళ్లాలని ఆదేశాలు జారీ చేయబడ్డాయి. కోర్టు హాజరు కోసం మాత్రమే ముందస్తు అనుమతితో కమిషనరేట్ పరిధిలోకి ప్రవేశించేందుకు అనుమతి ఇవ్వబడుతుంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ప్రజలు భయభ్రాంతులకు లోనుకాకుండా నేరాలపై సమాచారం అందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.



# నేతాజీ జీవితం స్ఫూర్తిదాయకం

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

స్వతంత్ర సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని, వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కరీమాబాద్ ప్రాంతంలో సుభాష్ కమిటీ అధ్యక్షులు పూదరి అజయ్ గౌడ్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి బీజేపీ రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొని, విగ్రహానికి పూలమాలలు వేసి సుభాష్ చంద్రబోస్ సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం నేతాజీ చేసిన త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశభక్తి, శౌర్యం, నాయకత్వానికి సుభాష్ చంద్రబోస్ చిరునామా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు పూదరి అజయ్ గౌడ్, ఉపాధ్యక్షులు నాగపురి సంతోష్ గౌడ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల మహేష్, జిల్లా కార్యదర్శి మందా శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ మెంబర్ కోమాకుల నాగరాజు, సీనియర్ కూచన క్రాంతి, బీజేవైఎం తూర్పు నియోజకవర్గ గౌడిశాల కార్తీక్ గౌడ్, యూత్ నాయకులు ఆదిత్య చిన్న మరియు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఇసుక రీచుల్లో వసూళ్ల పర్వం!

- లోడింగ్ పేరుతో రూ.3,200 అధిక చార్జ్
- ఇవ్వకుంటే గంటల తరబడి లారీ పక్కకే..
- అధికారులు హెచ్చరించినా మారని నిర్వాహకులు
- వీణవంక మండలం చల్లూరు ఇసుక రీచ్‌లో అక్రమాలు



**వేద న్యూస్, కరీంనగర్:**



కరీంనగర్ జిల్లా పరిధిలోని ఇసుక రీచ్లలో అక్రమ వసూళ్ల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. ఉన్నతాధికారులు కఠిన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, నిర్వాహకులు లోడింగ్ చార్జీల పేరుతో లారీ డ్రైవర్ల నుంచి ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో లోడింగ్ చార్జ్, పట్టా, లెవలింగ్ పేర్లతో ఒక్కో లారీపై రూ.5,600 వరకు వసూలు చేసిన ఘటనలపై లారీ డ్రైవర్లు, ఇసుక లారీ అసోసియేషన్ నేతలు టీజీఎండీసీ ఎండీ భవేశ్ మిశ్రా, మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారులు కఠిన ఆదేశాలు జారీ చేశారు. దీంతో అప్పట్లో వసూళ్లు కొంత తగ్గినప్పటికీ, తాజాగా మళ్లీ అక్రమ వసూళ్లు మొదలయ్యాయి.

**లోడింగ్ పేరుతో వసూళ్లు**

లోడింగ్ చార్జ్ పేరుతో ప్రస్తుతం ఒక్కో లారీపై రూ.3,200 వరకు వసూలు చేస్తున్నట్లు డ్రైవర్లు ఆరోపిస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే ఇసుక లోడింగ్ చేయకుండా లారీలను గంటల తరబడి పక్కకు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని వారు వాపోతున్నారు. వీణవంక మండలం చల్లూరు ఇసుక రీచ్‌లో లోడింగ్ చార్జ్ ఇవ్వలేదన్న కారణంతో లారీని పక్కకు పెట్టిన ఘటనకు సంబంధించిన ఆడియో రికార్డు బయటకు రావడం కలకలం రేపింది. ఈ అక్రమాలు టీజీఎండీసీ ఏస్ఆర్వోల కళ్ల ముందే జరుగుతున్నాయని డ్రైవర్లు ఆరోపిస్తున్నారు.

**అధికారులు హెచ్చరించినా..**

ఇటీవల జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిబంధనల ప్రకారం ఇసుక తవ్వకాలు, రవాణా జరగాలని ఆదేశించినా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి మారలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ వసూళ్లపై వెంటనే కఠిన చర్యలు తీసుకుని, లారీ డ్రైవర్లకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులు కోరుతున్నారు.

# సరస్వతి శిశు మందిర్‌లో వసంత పంచమి వేడుకలు

**వేద న్యూస్, మందమర్రి:**



వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరిం చుకొని మందమర్రి పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో సరస్వతి అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టారు. ఈ సంద ర్భంగా తల్లిదండ్రులు తమ చిన్నారులను తీసుకువచ్చి అక్షర శ్రీకారం చుట్టించారు. వేద పండితులు చిన్నారుల చేతులతో అక్షరాలు దిద్దిస్తూ విద్యాభ్యాసానికి తొలి అడుగు వేయిం చారు. పాఠశాల ఆవరణ అంతా చిన్నారులు, తల్లిదండ్రులతో సందడిగా మారిం ది. పాఠశాల ప్రధాన ఆచార్యులు కట్ట శిరీష, కార్యదర్శి దాసరి రాములు మాట్లాడుతూ, విద్యతోనే ప్రగతి సాధ్యమని పేర్కొన్నారు. గత 50 ఏళ్లుగా వసంత పంచమి రోజున అక్షరాభ్యాస కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నామని తెలిపా రు. ఈ పవిత్ర దినాన అక్షంాభ్యాసం చేయిస్తే పిల్లలు ఉన్నత స్థాయికి ఎదుగుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్ సూపర్ మార్కెట్ యాజమాన్యం అక్షరాభ్యాసానికి అవసరమైన పలకలు, బలపాలు, పుస్తకాలు ఉచితంగా అందజేశారు. ప్రతి సంవత్సరం ఈ సామాగ్రిని ఉచితంగా అందజేయడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు బండారి సూరిబాబు, ఆచార్య శ్రీజ, మాస్టర్ రమేష్ రాజా, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# హరిహర దేవస్థానంలో నూతన కార్యవర్గం ఎన్నిక

**వేద న్యూస్, మందమర్రి:**



ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా మందమర్రి మండలంలోని హరిహర దేవస్థానంలో నూతన కార్యవర్గ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వసంత పంచమి, రజతోత్సవ వేడుకలను పురస్కరించు కొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం గణపతి హోమంతో వేడుకలు ప్రారంభమై, అనంతరం స్వామివారికి అభిషేకాలు, మధ్యాహ్నం శాస్త్ర ప్రీతి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మందమర్రి మండల తాసిల్దార్ సతీష్ కుమార్ చేతుల మీదుగా నూతన కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. గౌరవ అధ్యక్షులుగా బర్ల సదానందం, ప్రెసిడెంట్‌గా తవటం శ్రీనివాస్, సెక్రటరీగా రమేష్ గౌడ్, అధికారిగా కొమ్ము రాజేష్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి ఆలయ అర్చకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మెట్టుగుట్ట రామాలయంలో హుండీల లెక్కింపు పూర్తి

**వేద న్యూస్, మడికొండ:**




వరంగల్ మహానగరంలో దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన మెట్టుగుట్టపై కొలువైన మెట్టు రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం ఆలయ హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఆలయానికి చెందిన ఐదు హుండీలను కార్యనిర్వహణాధి కారి ఎస్. సత్యనారాయణ, గిర్మాజీపేట దుర్గేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధి కారి పి. ప్రసాద్ పర్యవేక్షణలో లెక్కించగా, నోట్ల రూపంలో రూ. 90,870, నాణేల రూపంలో రూ. 13,761, మొత్తం రూ. 1,04,631 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామాలయ అర్చకులు పరాశరం విష్ణువర్ధనాచార్యులు, శివాలయ అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పారుపల్లి సత్యనారాయణ శర్మ, శ్రీ రాజరాజేశ్వర స్వామి సేవాసమితి సభ్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సిట్ విచారణపై కేటీఆర్ సూటి ప్రశ్నలు

- తప్పుడు లీకులు వ్యవస్థ వైఫల్యమా? కుట్రనా?

**వేద న్యూస్ హైదరాబాద్ :**



తనను విచారణ చేస్తున్న సిట్ అధికారులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు తీవ్రంగా ప్రశ్నించినట్టు సమాచారం. తాను గానీ, తమ పార్టీ నాయకులు గానీ విచారణకు హాజరవుతున్న ప్రతిసారి బయటకు తప్పుడు సమాచారం ఎలా వెళ్తోందని ఆయన నిలదీశారు. విచారణ జరుగుతున్న సమయంలో ఎవరి అనుమతితో ఇష్టానుసారంగా లీకులు ఇస్తున్నారని పోలీసు అధికారులను కేటీఆర్ ప్రశ్నించారు. విచారణ గదిలో అసలు జరగని విషయాలు కూడా మీడియా స్టూడియోలకు చేరుతున్నాయంటే, ఇది వ్యవస్థ వైఫల్యమా లేక ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న కుట్రనా అని ఆయన సూటిగా అడిగినట్టు తెలుస్తోంది. సిట్ విచారణ అనేది చట్టబద్ధమైన, బాధ్యతాయుతమైన ప్రక్రియ అని గుర్తు చేసిన కేటీఆర్, ఇలాంటి చీప్ లీకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని మండిపడ్డారు. దర్యాప్తు పేరుతో రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవస్థను దుర్వినియోగం చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆయన వ్యాఖ్యానించినట్టు సమాచారం. నిజంగా న్యాయం చేయాలనుకుంటే ముందు ఈ తప్పుడు లీకులను నిలిపివేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాజకీయ ప్రతీకారం కోసమే ఇలాంటి చర్యలు చేపడితే ప్రజలు తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. పోలీసులు ప్రభుత్వానికి కాదు, రాజ్యాంగానికి విధేయులని గుర్తుంచుకోవాలని సిట్ అధికారులకు కేటీఆర్ స్పష్టం చేసినట్టు సమాచారం.

# వాణినికేతన్ లో వసంత పంచమి వేడుకలు

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**




రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వాణినికేతన్ హైస్కూల్‌లో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో సరస్వతి దేవి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి విద్యాభ్యాసానికి శ్రీకారం చుట్టారు. సరస్వతి దేవి కటాక్షంతో విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనిధి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంతోష్, రాజు, రమేష్, తిరుపతి, సుమంగళి, శోభ, రేఖ, మహాలక్ష్మి, లావణ్య, సునంద, మౌనిక, కళ్యాణి, రేణుక, జలజ, శాంత, పద్మ, సునీత, శమీమా, స్వాతి తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేద న్యూస్

శనివారం జనవరి 24, 2026

# అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



**వేద న్యూస్, దామరచర్ల:**

వసంత పంచమి సందర్భంగా దామరచర్ల మండలంలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు అక్షరాలను దిద్దించి విద్యాభ్యాసానికి తొలి అడుగు వేశారు. దామరచర్ల మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-4లో గ్రామ సర్పంచ్ బంటు రేణుక సిరి, ఉప సర్పంచ్ గాలి ప్రియాంకలు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అలాగే దిలావర్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ సాయి, మండల విద్యాధికారి సైదానాయక్ పాల్గొని అక్షరాలు దిద్దించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాధవి, వార్డు సభ్యులు సాలమ్మ, సుమతి, అంగన్‌వాడీ టీచర్లు గాజుల పద్మ, పొలు పుష్ప, పావని, చైతన్య, అలివేలు, అబీబ్ ఉన్నిసా బేగం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో సామూహిక హనుమ సింధూర అర్చనలు



**వేద న్యూస్, మందమర్రి:**

వసంత పంచమిని పురస్కరించుకొని మందమర్రి పట్టణంలోని పాల చెట్టు ప్రాంతంలో ఉన్న పంచముఖి ఆంజనేయ స్వామి దేవాలయంలో సామూహిక హనుమ సింధూర అర్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఆలయ అర్చకులు కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని స్వామివారికి సింధూర అర్చనలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు కృష్ణ చైతన్య మాట్లాడుతూ.. హనుమాన్ జన్మదినం, పూర్వాభాద్ర నక్షత్రం, వసంత పంచమి, శుక్రవారం కలిసి వచ్చిన శుభముహూర్తాన్ని పురస్కరించుకొని ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. సీతమ్మ నుదుటన ధరించిన సింధూరంతో శ్రీరాముడు క్షేమంగా ఉంటాడని భావించి హనుమంతుడు సింధూరం ధరించిన కథను వివరించారు. పవిత్రమైన వసంత పంచమి రోజున ఈ పూజలు నిర్వహించడం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిందని తెలిపారు.

# శిశు మందిర్‌లో సామూహిక అక్షరాభ్యాసాలు



**వేద న్యూస్, ఆదిలాబాద్:**

ఇచ్చోడ మండల కేంద్రంలోని స్థానిక సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులచే హోమం నిర్వహించి, 3 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల 35 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న విశ్రాంత ఉపాధ్యాయులు బొడ్డు బోజన్న మాట్లాడుతూ.. సరస్వతీ అమ్మవారి జన్మదినమైన వసంత పంచమి రోజున అక్షరాభ్యాసం చేయించుకుంటే విద్యా బుద్ధులు కలుగుతాయని, సరస్వతీ దేవి కృపా కటాక్షాలు లభిస్తాయని అన్నారు. వేద మంత్రాలతో హోమం అనంతరం వేద పండితులు గౌతమ్ దేశ్ పాండే చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త మిట్టపల్లి శంకరయ్య, పాఠశాల కమిటీ సభ్యులు రాజేందర్, సుదర్శన్, ప్రధానాచార్యులు సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు భారతి, ఉషారాణి, సుజాత, మంజుల, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# హిజ్రాలకు కౌన్సిలింగ్..!

- ప్రజలను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవు : సీఐ కరుణాకర్



**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**

వరంగల్ ఎంజీఎం సిగ్నల్ వద్ద కొందరు హిజ్రాలు ప్రయాణికుల నుంచి డబ్బులు అడుగుతూ, బొమ్మ పామును చూపించి, మెడలో పాము వేసుకున్నట్లు నటిస్తూ ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేశారు. ఇది గమనించిన కొందరు వీడియో చిత్రీకరించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మట్వాడ సీఐ కరుణాకర్ హిజ్రాలకు కౌన్సిలింగ్ ఇచ్చి, ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా హెచ్చరికలు జారీ చేశారు.

# మాకు న్యాయం చేయండి..

- పోతిరెడ్డిపల్లిలో 20 ఏళ్లుగా ఉంటున్నాం
- బలవంతంగా వెళ్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు
- బుడగ జంగాల ఆవేదన



**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో గత 20 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న బుడగ జంగాల వర్గానికి చెందిన ప్రజలు తమకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. తమను బలవంతంగా అక్కడి నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి అనేక సేవలు అందిస్తున్నామని, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటు హక్కు కూడా పోతిరెడ్డిపల్లిలోనే ఉందని బుడగ జంగాల వర్గం తెలిపింది. ప్రస్తుతం నివసిస్తున్న గుడిసెలను ఖాళీ చేయించి అడవిలోకి పంపిస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. గ్రామపంచాయతీ సభ్యులు అటవీ ప్రాంతంలో ఒక చోటు చూపించగా, అక్కడ గుడిసెలు వేసుకున్న సమయంలో శుక్రవారం ఉదయం కొందరు వ్యక్తులు వచ్చి వాటిని తొలగించారని బాధ వ్యక్తం చేశారు. తాము క్రింది స్థాయి వర్గానికి చెందినవారమని అవమానకరంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రస్తుతం నివసిస్తున్న స్థలం నుంచి గెంటివేసి డంప్ యార్డు సమీపంలోని భూమిలోనే ఉండాలని బెదిరించారని తెలిపారు. గ్రామానికి పని చేసే కొందరు వ్యక్తులు తమపై ఒత్తిడి తెస్తున్నారని కూడా పేర్కొన్నారు. ఈ విషయంపై పాత్రికేయులు తహసీల్దార్ సుజాతను వివరణ కోరగా, ఘటన స్థలానికి జీపీఓను పంపి సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

# అన్ని డివిజన్లలో వేగంగా అభివృద్ధి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- మడికొండలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- హాజరైన జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



**వేద న్యూస్, మడికొండ:**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మడికొండ 46, 64వ డివిజన్లలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ శంకుస్థాపన చేశారు. ముందుగా మడికొండ బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో మడికొండ అభివృద్ధి నిర్లక్ష్యానికి గురైందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి డివిజన్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికా రెడ్డి, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వస్కుల శ్రీను, కాజిపేట మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, బిల్లా రవీందర్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటరమణ గౌడ్, 46వ డివిజన్ అధ్యక్షులు వస్కుల నాగరాజు, 64వ డివిజన్ అధ్యక్షులు కుర్ల మోహన్, మెట్టగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, రామాలయం చైర్మన్ పల్లపు అర్జున్, మహిళా నాయకులు గుర్రం జ్యోతి అమర్నాథ్, నీలం రజిని, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, డివిజన్ అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# 'ఉపాధి'ని నిర్వీర్యం చేసే కుట్ర



- మోడీ ప్రభుత్వం కూలీల నోట్లో మట్టి కొడుతోంది
- కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి

**వేద న్యూస్, ఆదిలాబాద్:**

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి తీవ్రంగా విమర్శించారు. పని దినాలు పెంచుతున్నామని చెబుతూ నిధులు తగ్గించడం ద్వారా ఉపాధి కూలీల జీవనాధారాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. బోథ్ మండలంలోని ధన్నూర్ బి గ్రామపంచాయతీ పరిధిలో కండిగుట్ట వద్ద ఉపాధి హామీ కూలీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాలపై భారం పెంచుతూ, ఉపాధి హామీ పథకానికి కేంద్రం నిధులు తగ్గిస్తోందని, సాంకేతికత పేరుతో చెల్లింపులు నిలిపివేస్తూ కూలీలపై అదనపు భారాన్ని మోపుతోందని అన్నారు. నూతన నిబంధనల ద్వారా డిమాండ్ ఆధారిత పని విధానాన్ని తొలగించడం, గ్రామాలలో అధికారులు పనులు సూచించే విధానాన్ని ప్రవేశపెట్టడం పథక లక్ష్యాలకు విరుద్ధమని విమర్శించారు. ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకంగా మార్చి, పార్లమెంట్‌కు సంబంధం లేకుండా మార్పులు చేసే విధానం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ పేరును ఉపాధి హామీ పథకం నుంచి తొలగించేందుకు రాజకీయ దురుద్దేశంతో ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది రాజకీయ రాక్షస క్రీడకు నిదర్శనమని అన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల హక్కులను కాలరాయడం సరికాదని స్పష్టం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించే వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# పచ్చని కాపురాల్లో 'బెల్ట్' చిచ్చు!

- అడ్డూ అదుపు లేకుండా మద్యం విక్రయాలు
- బానిసలవుతున్న యువత
- ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మకాలు
- ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండలంలోని పలు గ్రామాల్లో అక్రమ బెల్ట్ షాపుల నిర్వహణతో మద్యం ఏరులై పారుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో మద్యం విక్రయాలు అదుపు తప్పాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యేకించి యువకులు మద్యానికి బానిసలవుతూ తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైన్ షాప్ యజమానులే తమ వద్ద పనిచేసే సిబ్బంది ద్విచక్ర వాహనాల ద్వారా మద్యం బెల్ట్ షాపులకు తరలిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలోని మద్యం దుకాణం సమీప గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎనీ టైం మద్యం విక్రయాలు సాగుతున్నాయి. కిరాణా దుకాణాలు, హోటళ్లు, నివాస గృహాలు, రహదారుల పక్కన కూడా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు ప్రజలు చెబుతున్నారు. ఉదయం టీ, కాఫీలకు బదులు మద్యం అందించే పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు. దీంతో ఉదయమే మద్యం సేవించి పలువురు రోడ్లపై పడిపోవడం, గాయాలపాలవడం వంటి ఘటనలు పెరుగుతున్నాయి. గతంలో వైన్ షాప్ పరిసరాలకే పరిమితమైన ఈ దందా ప్రస్తుతం గల్లీలకు విస్తరించిందని గ్రామస్తులు వాపోతున్నారు.

**అప్పిచ్చి మరీ..**




ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ మందు బాబుల జేబులను ఖాళీ చేస్తున్నారని, కొందరు బెల్ట్ షాప్ నిర్వాహ కులు ఖాతాల పేరుతో అప్పులు ఇచ్చి, చెల్లించలేని పరిస్థితిలో దౌర్జన్యాలకు దిగుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగా అనేక కుటుంబాల్లో కలహాలు చెలరేగి పచ్చని కాపురాలు ఛిద్రమవుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కమిషన్లతో మద్యం సరఫరా?**

మండల కేంద్రంలోని లైసెన్స్ పొందిన వైన్ షాప్ యజమా నులు గ్రామాల్లో కమిషన్ ఏజెంట్లను నియమించి మద్యం విక్రయాలు చేస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాల ద్వారానే మద్యం సరఫరా జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు.

**ఎక్సైజ్, పోలీసుల మౌనం**

పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎక్సైజ్ శాఖ, పోలీసు అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మౌనం వెనుక మతలబు ఏమిటి?, ఈ దందాలో అధికారుల వాటా ఎంత? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా గ్రామాల్లో అక్రమ బెల్ట్ షాపులపై వెంటనే కఠిన చర్యలు తీసుకొని, పల్లెల్లో ప్రశాంత వాతావరణం కల్పించాలని వివిధ గ్రామాల ప్రజలు, మహిళలు అధికారులను కోరుతున్నారు.

# సీఎంవి డైవర్షన్ రాజకీయాలు

- బీఆర్ఎస్వీ నేతల విమర్శ

**వేద న్యూస్, శాయంపేట:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైవర్షన్ రాజకీయాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని బీఆర్ఎస్వీ నాయకులు ఆరోపించారు. శాయంపేట మండల కేంద్రంలో నాయకులు కొమ్ముల శివ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొమ్ముల శివ, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మారపల్లి మోహన్, మైలారం గ్రామ మాజీ సర్పంచ్ అరికెళ్ల ప్రసాద్ తదితరులు పాల్గొని రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయినా, ఇచ్చిన ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు కాలేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులపై విచారణల పేరుతో వేధింపులకు పాల్పడుతూ మాజీ మంత్రి హరీష్ రావు, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాల అమలులో కాలయాపన జరుగుతోందని, ప్రజల సమస్యలపై ప్రభుత్వం విఫలమవుతోందని అన్నారు. ఇలాంటి ప్రజా



వ్యతిరేక విధానాలకు రాబోయే రోజుల్లో ప్రజల చేతిలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు ధైనంపల్లి కరన్ బాబు, కూతాటి రమేష్, యూత్ జిల్లా నాయకులు పెంబర్తి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# 'వాక్‌థాన్- రన్ ఫర్ రోడ్ సేఫ్టీ' పోస్టర్ల ఆవిష్కరణ



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న వాక్‌థాన్- రన్ ఫర్ రోడ్ సేఫ్టీ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. వేములవాడ సబ్ డివిజన్ పోలీస్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 7 గంటలకు చెక్కపల్లి చౌరస్తా నుంచి బలనగర్ కోర్టు గ్రౌండ్ వరకు 2 కిలోమీటర్ల రన్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ రుత్విక్ సాయి, అదనపు ఎస్పీ చంద్రయ్య, సీఐ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు రమేష్, సురేష్, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క, సారలమ్మకు మొక్కులు



**వేద న్యూస్, మందమర్రి:**

కోరిన కోరికలు తీర్చే వనదేవతలుగా ప్రసిద్ధిగాంచిన సమ్మక్క - సారలమ్మలకు మొక్కులు చెల్లించే సంప్రదాయంలో భాగంగా అంజనీపుత్ర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో పిల్లి రవి తండ్రి పిల్లి మల్లయ్య, కూతురు శ్రీ నిత్యాకు నిలువెత్తు బంగారం (బెల్లం) తులాభారం వేసి అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు. అనంతరం పట్టణంలోని వారి నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లి రవి మాట్లాడుతూ, సమ్మక్కసారలమ్మ తల్లుల కృప కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, తమ కుటుంబంపై అమ్మవార్ల ఆశీస్సులు ఎల్లప్పుడూ నిలవాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లి రవి కుటుంబ సభ్యులు, మిత్రులు, అనుచరులు, అభిమానులు పాల్గొన్నారు.

# డా. అఫ్సర్‌కు జాతీయ సాహిత్య పురస్కారం



**వేద న్యూస్, హైదరాబాద్:**

సుప్రసిద్ధ కవి, విమర్శకులు, పరిశోధకులు డా. అఫ్సర్‌కు 2026 సిటీ కాలేజ్ మఖ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ సాహిత్య పురస్కారం లభించినట్లు ప్రభుత్వ సిటీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, అవార్డు కమిటీ కన్వీనర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. కవిగా, కథారచయితగా, విమర్శకునిగా, పరిశోధకునిగా నాలుగు దశాబ్దాలుగా డా. అఫ్సర్ అందించిన విశిష్ట సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు అవార్డు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా డా. విప్లవ్ దత్ శుక్లా మాట్లాడుతూ, సాహిత్య రంగంలో డా. అఫ్సర్ చేసిన కృషి అనన్యసాధారణమని ప్రశంసించారు. పురస్కార ప్రదాన సభ జనవరి 27న ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్ ప్రభుత్వ సిటీ కళాశాలలో నిర్వహించనున్నట్లు అవార్డు కమిటీ సభ్యులు డా. కోయి కోటేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం డా. అఫ్సర్ అమెరికాలోని పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయంలో దక్షిణాసియా అధ్యయన విభాగంలో విదేశీ భాషల అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన స్వస్థలం ఖమ్మం జిల్లా.

# ఉచితంగా మెరుగైన ప్రభుత్వ విద్య

- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం
- ప్రభుత్వ కళాశాల ఇంచార్జి క్యాతం సత్యనారాయణ
- తల్లితండ్రులు, గురువుల ఆత్మీయ సమ్మేళనం



**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులు, గురువుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశంలో కళాశాల ఇంచార్జి క్యాతం సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం సీసీటీవీ పర్యవేక్షణలో ఉచితంగా మెరుగైన విద్య అందిస్తున్నదని తెలిపారు. ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా ద్వారా జేఈఈ, నీట్, ఈఏప్‌సెట్, క్లాట్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, ముఖగుర్తింపు ఆధారంగా హాజరు విధానం అమలు చేస్తున్నామని తెలిపారు. సీనియర్ ఉపన్యాసకులు వాసరవేణి పర్శరాములు మాట్లాడుతూ.. విద్యార్థులపై తల్లిదండ్రులు, సమాజం, గురువుల ప్రభావం అత్యంత ముఖ్యమని అన్నారు. ఇంటి వద్ద తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలలో చదివిన విద్యార్థులకు బీటెక్, ఫార్మసీలో ఉచిత విద్య అవకాశాలు ఉన్నాయని తెలిపారు. త్వరలో డిజిటల్ బోర్డుల ద్వారా పూర్తి స్థాయిలో బోధన అందిస్తామని చెప్పారు. పూర్వ విద్యార్థి, ఏఎస్ఐ శంకర్ మాట్లాడుతూ, ఈ కళాశాలలో చదవడం తన అదృష్టమని పేర్కొంటూ, విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఎన్ఎస్ఎస్, టెలిమానస్, యాంటీ డ్రగ్, యోగా, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాలలో చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు జి. శంకర్, కె. ప్రదీప్, బి. బుగ్గ రాములు, బి. ప్రశాంత్‌లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చెరుకు భూమక్క, బుట్ట కవిత, నీరటి విష్ణు ప్రసాద్, గజ్జెల గంగాధర్, జ్యాతోతు శ్రీనివాస్, అనుముల రవిచంద్ర, వెల్దండి సౌమ్య, అగోలం గౌతమి, వి.ఓ. మమత, బోధనేతర సిబ్బంది విమల్ కుమార్, షాహినా సుల్తానా, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చేనేత రుణమాఫీతో నేతన్నలకు ఊరట

**- ఏడీ, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన మాజీ ఎంపీపీ**



**వేద న్యూస్, శాయంపేట:**

చేనేత రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని చేనేత కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ. 9 లక్షల రుణమాఫీ మొత్తాన్ని చెక్కుల రూపంలో అందజేయడంతో చేనేత కార్మికులకు ఊరట లభించింది. ఈ మేరకు మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో పనిచేస్తున్న కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కార్మిక మినిమమ్ వేజెస్ బోర్డు సభ్యుడు, మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాష్ మాట్లాడుతూ.. చేనేత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు. రుణభారం తగ్గడంతో కార్మికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. చేనేత రుణమాఫీ అమలుకు సహకరించిన చేనేత శాఖ ఏడీ విజయలక్ష్మి, భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావులకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు అండగా నిలవడం ఆనందకరమని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు.

# జనసేవకు డాక్టర్ సురంజన్ ప్రాధాన్యత

**- కాంగ్రెస్ లో చేరిన ప్రముఖ వైద్యుడు**



**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలో నిరుపేదల వరంగా గుర్తింపు పొందిన డాక్టర్ సురంజన్ కాంగ్రెస్ పార్టీలో చేరడం రాజకీయంగా, సామాజికంగా విశేష ప్రాధాన్యం సంతరించుకుంది. వైద్య వృత్తిలో ఎన్నో ఏళ్లుగా పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తూ, వందలాది కుటుంబాలకు ఆశగా నిలిచిన ఆయన ఇప్పుడు ప్రజాసేవను మరింత విస్తృతంగా చేయాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీలో చేరారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాహిత సంక్షేమ పథకాలు, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల జీవితాల్లో వస్తున్న మార్పు తనను ఆకట్టుకున్నాయని డాక్టర్ సురంజన్ తెలిపారు. అలాగే హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ ఆధ్వర్యంలో జరుగుతున్న అద్భుతమైన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న పతకాలని చూసి కాంగ్రెస్ పార్టీలోకి రావడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు నిజమైన న్యాయం జరుగుతోంది అని,సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం, అలాగే ఒడితల ప్రణవ్ చేస్తున్న ప్రజాసేవా కార్య క్రమాలు ఎంతో ప్రేరణ నిచ్చాయి అని,ప్రణవ్ ఆధ్వర్యంలో జమ్మి కుంట ప్రజలకు సేవ చేయడం నా అదృష్టంగా భావి స్తున్నాను" అని పేర్కొన్నారు. ఇప్పటివరకు వైద్యుడి గా చేసిన సేవను, ఇకపై ప్రజా ప్రతినిధిగా మరింత బలంగా కొనసాగించడమే తన లక్ష్యమని డాక్టర్ సురంజన్ స్పష్టం చేశారు. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో పేదల సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల మెరుగుదల,ఆరోగ్యంపరిశుభ్రతవిద్య వంటి రంగాల్లో అంకితభావం తో పనిచేస్తానని హామీ ఇచ్చారు. సేవా భావంతో ముందుకు వచ్చిన డాక్టర్ సురంజన్ కాంగ్రెస్‌లో చేరడం ద్వారా జమ్మికుంట ప్రజలకు మరింత బలమైన గొంతు లభిస్తుందని, ఇది ప్రజలకు మంచి సందేశాన్ని ఇస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# క్యాంటీన్ నిర్వహకురాలకు సన్మానం



**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

వరంగల్ రామన్నపేట లోని డాక్టర్. ఏ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వరంగల్ కలెక్టరేట్ ప్రాంగణంలో క్యాంటీన్ నిర్వహిస్తున్న వరంగల్ మట్టెవాడకు చెందిన మొగిలి శ్రీదేవికి ఈ నెల న్యూఢిల్లీలో జనవరి 26న జరిగే గణతంత్ర వేడుకలకు ఆహ్వానం అందించిన సందర్భంగా వీరిని ట్రస్ట్ చే ఘనంగా సన్మానించారు. ముఖ్యంగా వ్యాపారంలో మహిళలు కూడా మేమున్నాము ముందుకు అని నిరూపించినటువంటి వరంగల్ జిల్లాకు చెందిన శ్రీదేవిని న్యూఢిల్లీలో జరిగే జనవరి 26 న జరిగే గణతంత్ర వేడుకలకు లో భాగంగా ఆహ్వానం ఎంపిక చేయడము ముఖ్యంగా వరంగల్ కు గర్వకారణంగా భావించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్ట్ డాక్టర్. ఏ. రాజేంద్రప్రసాద్ తో పాటు ఆర్గనైజర్ శ్రవణ్ , సభ్యులు శైలజ, ఆడెపు రవివర్మ, డోలి ఎల్లయ్య, లోక్సత్తా నగర కార్యదర్శి ఇనుముల రమేష్, కట్టమల్లు, హరీష్ మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, పాలకవర్గం ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎం. రాజు మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో సుభాష్ చంద్రబోస్ చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఆయన చూపిన దేశభక్తి, త్యాగస్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో ముస్కానిపేట గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, వార్డు సభ్యులు మామిడి సుశీల, చేరాల వంశీ, రాకం సుమన్, అంతటి శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మామిడి నరేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఒగ్గు రమేష్, కొట్టే వెంకన్న, గడ్డం రవీందర్ రెడ్డి, కునబోయిన దేవయ్య, మామిడి రాజు, అంగన్వాడీ టీచర్లు విజయ, అరుణ, బాబాయి, బి.ఎల్.ఓ రహిమున్నిస, నర్సయ్య, యువజన సంఘాల నాయకులు ఎర్రోజు రవితేజ, ఎర్రోజు సంతోష్ కుమార్, ఎలుక రాము, దయ్యాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వాహనాలు నడిపిన 8 మంది మైనర్లు

**- బాలల పరిరక్షణ గృహానికి తరలించిన పోలీసులు**



**వేద న్యూస్, కాజీపేట:**

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా లైసెన్సు లేకుండా వాహనాలు నడుపుతున్న మైనర్లను గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన 8 మంది మైనర్ బాలురను జువెనైల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా, మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు వారిని ఒక రోజు పాటు బాలల పరిశీలన గృహానికి తరలించినట్లు ట్రాఫిక్ సీఐ వెంకన్న తెలిపారు. ఇకపై డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపే మైనర్లు, మేజర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇలాగే ఛార్జిషీట్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

# ఘనంగా వసంత పంచమి వేడుకలు

**- జమ్మికుంట కేరళ పాఠశాలలో..**



**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని కేరళ పాఠశాలలో వసంత పంచమి సందర్భంగా సరస్వతీ పూజ శుక్రవారం నిర్వహించారు. పాఠశాల ప్రాంగణమంతా విద్యా పరిమళం వెల్లివిరిసింది. విద్యార్థులు చదువుల తల్లి సరస్వతి దేవిని అర్చిస్తూ.. జ్ఞాన కాంతులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కె ఎస్ బెన్ని సరస్వతీ దేవికి జ్యోతి ప్రజ్వలన చేస్తూ... నూతన విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు చేపట్టారు.పాఠశాల చైర్మన్ మాట్లాడుతూ.. వసంత పంచమిని సరస్వతి పూజ అని కూడా అంటారనీ ,ప్రతి సంవత్సరం మధుమాసం 5వ రోజున వసంత పంచమి జరుపుకుంటారనీ తెలిపారు. చదువుల తల్లి సరస్వతీ దేవి ఆవిర్భవించిన రోజు మరో అర్థం విద్య కాంతిని వెదజల్లే కాంతి లాగా పిలుస్తారని., విద్యార్థులకు తెలియజేసి నూతన విద్యార్థులకు అక్షరాభ్యాసం చేసి. పాఠశాలకు ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాళ్లు, పాల్గొన్నారు. విద్యార్థులు, విద్యార్థిను లు సరస్వతీ వందనం శాస్త్రీయ నృత్యాలు క్రమశిక్షణతో కూడిన భక్తిని చాటుకున్నారు.

వేద న్యూస్

శనివారం జనవరి 24, 2026

# వరంగల్ జిల్లా సందర్శించిన కర్ణాటక క్రీడాకారులు



**వేద న్యూస్, హనుమకొండ:**

మై భారత్ – వరంగల్, యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర యువజన మార్పిడి కార్యక్రమంలో భాగంగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన 40 మంది యువతీ యువకులు ఉమ్మడి వరంగల్ జిల్లాను సందర్శించారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక ప్రదేశాలను సందర్శించి వాటి ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. అనంతరం వడ్డేపల్లి పల్ల రవీందర్ రెడ్డి భవన్‌లో నిర్వహించిన యువత మధ్య పరస్పర అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, భారత్ వివిధ రాష్ట్రాల సంస్కృతులు, భాషలు, సంప్రదాయాలతో సమృద్ధిగా ఉందని పేర్కొన్నారు. ఇలాంటి యువజన మార్పిడి కార్యక్రమాలు దేశ సమైక్యత, జాతీయ ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. యువతే దేశ భవిష్యత్తు అని, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మై భారత్ – వరంగల్ ఉప సంచాలకులు చింతల అన్వేష్, వాలంటీర్లు సురేష్, నవీన్, కర్ణాటక రాష్ట్ర యువజన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలి




**– కాసిపేట ఎస్సై ఆంజనేయులు – రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం**

**వేద న్యూస్, కాసిపేట:**

ప్రతి ఒక్కరూ తమ కుటుంబాల కోసం క్షేమంగా ఇంటికి చేరాలనే ఉద్దేశంతోనే పోలీస్ శాఖ 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని చేపట్టిందని కాసిపేట ఎస్సై ఆంజనేయులు తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచే లక్ష్యంతో కాసిపేట మండల కేంద్రంలోని కల్వరి చర్చిలో శుక్రవారం 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పోలీసులు సందర్భంగా ప్రార్థనలకు వచ్చిన భక్తులు, స్థానిక ప్రజలను ఉద్దేశించి రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అనేక ప్రాణాలు కోల్పోతున్నారని, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలని హెచ్చరించారు. లైసెన్స్ లేని మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. అతివేగం ప్రమాదకరమని, రోడ్డు నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా ప్రయాణించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, ప్రజల ప్రాణ రక్షణే తమ ప్రధాన బాధ్యత అని పోలీసులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాసిపేట పోలీసు సిబ్బంది, చర్చి నిర్వాహకులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ సహజ వనరులపై ఆదివాసీకే హక్కు



**– పీసా కోఆర్డినేటర్ అర్క వసంత్ రావ్**

**వేద న్యూస్, కాసిపేట:**

ఏజెన్సీ ప్రాంతాల్లోని అడవులు, నీరు, భూమి, ఇసుక, రాళ్లు వంటి సహజ వనరులపై స్థానిక ఆదివాసీలకే హక్కులు ఉంటాయని ఐటీడీఏ ఉట్నూర్ పీసా కోఆర్డినేటర్ అర్క వసంత్ రావ్ తెలిపారు. కాసిపేట మండలం రొట్టేపల్లి ఏజెన్సీ గ్రామంలో పెసా యాక్ట్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వసంత్ హాజరై, పీసా చట్టం ప్రాముఖ్యతను గ్రామస్తులకు విపులంగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెసా యాక్ట్ ప్రకారం గ్రామ సభలు నిర్వహించి తీసుకునే తీర్మానాల ద్వారానే ఈ వనరులను వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గ్రామ సభ తీర్మానం అసెంబ్లీ తీర్మానంతో సమానమని, దానిని ఎవరూ విస్మరించలేరని పేర్కొన్నారు. ఈ చట్టాన్ని అతిక్రమించిన వారు చట్టపరంగా నేరస్థులుగా పరిగణించబడతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో రొట్టేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో క్వారీ లీజు కోసం రొడ్డ రమేష్ పెట్టిన దరఖాస్తును గ్రామ సభ ఏకగ్రీవంగా తిరస్కరించింది. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆత్రం కళావతి, ఉప సర్పంచ్ అల్క రాజు, పంచాయతీ కార్యదర్శి రొడ్డ సౌందర్య, వార్డు సభ్యులు పెంద్రం తిరుపతి, టేకం శ్రీనివాస్, పెంద్రం హన్మంతు, కుమరం భీం యువజన సంఘం అధ్యక్షులు, గ్రామ పటేళ్లు చిక్రం భీము, కోవ గణపతి, సుర్పం రామకృష్ణ, ఆడే జంగు, ఆత్రం పెద్ద చిన్ను, చిన్న చిన్ను, కుమరం భగవంత్, రామ్ దాస్, నాగరాజ్, వినోద్, అర్జున్, తిరుపతి, సురేందర్, లేతుబాయి, మారుబాయి తదితర గ్రామస్తులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధిద్దాం

**– పార్టీలకతీతంగా పని చేద్దాం**
**– వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**
**– సర్పంచుల శిక్షణ కార్యక్రమం ముగింపు**



**వేద న్యూస్, వనపర్తి:**

గ్రామాల్లోని ప్రజలందరూ మనకు సమానమేనని, పార్టీలకతీతంగా పనిచేసి గ్రామాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. వనపర్తి శివారులోని వైటీసీ యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఐదు రోజులుగా కొనసాగిన సర్పంచుల శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశానికి శుక్రవారం ఆయన హాజరయ్యారు. ఖిల్లా ఘణపురం, పెద్దమందడి, కొత్తకోట, మదనాపురం, అమరచింత, ఆత్మకూర్, గోపాల్పేట మండలాలకు చెందిన 133 మంది సర్పంచులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రత, తాగునీరు, వీధిదీపాలు, డ్రైనేజీలు, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు వంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి పనిలో వార్డు సభ్యులను భాగస్వాములు చేయాలని, గ్రామసభలకు సంబంధిత అధికారులు హాజరయ్యేలా చూడాలన్నారు. గ్రామస్థాయిలో ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రైతు భీమా, భూ వివరాల అప్డేట్‌లపై ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మహిళా సమైక్య భవనాల కోసం స్థల సేకరణ చేస్తే తాను భవనాలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. సర్పంచుల గౌరవ వేతనం పెంపు, పదవీకాలం అనంతరం పింఛన్ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్తానన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని గ్రామసభల్లో తీర్మానాలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం శిక్షణ పూర్తిచేసిన సర్పంచులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, స్థానిక సంస్థల కలెక్టర్ యాదయ్య, డీఎల్పీవో రఘునాథ్ రెడ్డి, డీపీఓ చక్రవర్తి, డీఆర్‌డీఓ డీవోటీ రాజు, ఎంపీడీవోలు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

# దేవాపూర్‌లో సీఎం కప్ వాలీబాల్ టోర్నమెంట్



**వేద న్యూస్, కాసిపేట:**

దేవాపూర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సీఎం కప్ గ్రామస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌ను గ్రామ సర్పంచ్ సిడం రాందాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించి మంచి భవిష్యత్తు సాధించాలని ఆకాంక్షించారు. గ్రామ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపట్టిన సీఎం కప్ పోటీలు యువతకు మంచి వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఐక్యత, ఆరోగ్యం పెంపొందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కవిత, వార్డు సభ్యులు సంద్ర భీమయ్య, కలవేన లలిత, సిడం కమల, ఆత్రం మహేష్ పాల్గొన్నారు. గ్రామ పెద్దలు పటేల్ అచ్యుత్ రావు, కుమరం జనార్ధన్, సామ రాజిరెడ్డి, మెరుగు శంకర్, మడవి ధర్మారావు, కొడప జైరాం, షేక్ షఫీ, శ్రావణ్ తదితరులు హాజరయ్యారు. ఈ టోర్నమెంట్‌లో దేవాపూర్, పెద్దాపూర్, రాంపూర్ గ్రామాలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

# ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు



**వేద న్యూస్, కమలాపూర్:**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని విశ్వభారతి హైస్కూల్‌లో స్వాతంత్ర సమరయోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఏబీవీపీ కమలాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కమలాపూర్ టౌన్ సెక్రటరీ యశ్వంత్ మాట్లాడుతూ.. సుభాష్ చంద్రబోస్ చేసిన త్యాగాల ఫలితంగానే భారతదేశానికి స్వాతంత్రం లభించిందని అన్నారు. జైహింద్ నినాదంతో యువతలో దేశభక్తి, చైతన్యం నింపి స్వాతంత్ర ఉద్యమంలో పెద్దఎత్తున యువతను భాగస్వాములను చేసిన మహానేత చంద్రబోస్ అని పేర్కొన్నారు. యువత చంద్రబోస్‌ను ఆదర్శంగా తీసుకొని దేశ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

# గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకుల అరెస్ట్

**వేద న్యూస్, కాజీపేట:**

హనుమకొండ జిల్లా కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని విష్ణుపురి కాలనీలో శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. కాజీపేట ఎస్సై శివ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా, వారి వద్ద గంజాయి ప్యాకెట్లు లభించినట్లు తెలిపారు. అనంతరం కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్సై నవీన్ వెల్లడించారు. పట్టుబడ్డ నిందితుల్లో విష్ణుపురికి చెందిన గోరంటల రోహన్, ప్రశాంత్ నగర్కు చెందిన రాచర్ల రాజు ఉన్నారు. వారి వద్ద నుంచి మొత్తం 115 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇలాంటి అక్రమ చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# ఓటు శక్తివంతమైన ఆయుధం

**– ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి**
**– మందమర్రి ఎంపీడీఓ రాజేశ్వర్ రావు**



**వేద న్యూస్, మందమర్రి:**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని మందమర్రి మండల ఎంపీడీఓ రాజేశ్వర్ రావు పిలుపునిచ్చారు. శుక్రవారం జాతీయ ఓటర్ల దినోత్సవం 2026 పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, స్థానిక యువతతో కలిసి నిర్భయంగా, కుల, మత వర్గాలకు అతీతంగా, ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఎన్నికల్లో ఓటు వేస్తామని ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం ఆవిర్భవించిన రోజును పురస్కరించుకుని ప్రతి ఏటా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ, యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటు విలువను గుర్తించి ఎన్నికల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ పథక సిబ్బంది, ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలి

**– కాసిపేట ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్**




**వేద న్యూస్, కాసిపేట:**

జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కాసిపేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల స్థాయి ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ పథకం సిబ్బంది కలిసి ఓటరు హక్కు, బాధ్యతలపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి పౌరుడు బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛమైన, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సహాయకులు లక్ష్మీనారాయణ, జూనియర్ సహాయకులు తిరుపతి, ఈసీ మల్లేష్, టీఏ శంకర్, కంప్యూటర్ ఆపరేటర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అవకాశం ఇచ్చి గెలిపిస్తే నిస్వార్థంగా సేవ చేస్తా..

**– 16వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మిడిదొడ్డి శంకర్**
**– వార్డు ప్రజలను కోరిన శంకర్**



**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా మిడిదొడ్డి శంకర్ బరిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తన ను ఆశీర్వదించి ఒక అవకాశం కల్పిస్తే నిస్వార్థంగా సేవ చేస్తూ వారికి 24 గంటలు అందుబాటులో ఉంటానని తెలిపారు. స్వార్థం కోసం రాజకీయాల్లోకి రావడంలేదని నిస్వార్థంగా నిష్పక్షపాతంగా ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో ఎన్నికల బరిలో ఉండటం జరుగుతుందని తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజీపడకుండా సమస్యల పరిష్కారంలో ముందుంటానని ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని ప్రజలను చేతులెత్తి ప్రార్థించారు.

# అనారోగ్య బాధితునికి ఎల్‌వోసీ అందజేత



**వేద న్యూస్, కాజీపేట:**

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మారం ప్రసాద్‌కు సీఎం సహాయక నిధి ఎల్‌వోసీ కాపీని కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గత కొద్ది రోజులుగా చికిత్స పొందుతున్న కొత్తపెల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మారం ప్రసాద్‌ను నాయకులు కలిసి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. అనంతరం రూ.95వేలు విలువైన సీఎం సహాయక నిధి ఎల్‌వోసీ కాపీని అందజేసి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో 44వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కుల సదానందం, సోషల్ మీడియా కోఆర్డినేటర్ బొందుగుల సతీష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నాగపురి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# సమ్మక్క, సారలమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

**వేద న్యూస్, కారేపల్లి:**

కారేపల్లి మండల పరిధిలోని ఎర్రబోడు గ్రామంలో నిర్వహించిన సమ్మక్క సారక్క జాతరను వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ పూజారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, వైరా నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని వనదేవతలను ప్రార్థించారు. పూజల అనంతరం పూజారులతో కలిసి కోయ నృత్యంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు భూక్యా పద్మ, ఈసాల అలివేలు మంగ, మాజీ సొసైటీ చైర్మన్ ఈసాల నాగేశ్వరావు, మాజీ సర్పంచులు కురసం సత్యనారాయణ, భూక్యా సైదా, అజ్మీర వీరన్న, భూక్యా రామ్ కిషోర్, వాంకుడోత్ విజయ్, ఈదర కోటేశ్వరరావు, కాటేపల్లి నవీన్, ఈదర చలపతి తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073